సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 10 । డిసెంబర్ । 2024



అర్జీలు పునరావృతం కారాదు
ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశించారు. 8లో



ఆచార్యా.. పట్టా ఇచ్చేదెప్పుడో!
ఆంధ్ర విశ్వవిద్యాలయం రెగ్యులర్ వీసీ పోస్టు భర్తీ కాకపోవడంతో స్నాతకోత్సవం నిర్వహణపై స్పష్టత కొరవడింది. 8లో



అవినీతి... అభివృద్ధికి అవరోధం
అవినీతి పెరిగితే దేశ ప్రగతి కుంటుపడుతుందని అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ బీవీఎస్ నాగేశ్వర రావు అన్నారు. 8లో

న్యూస్‌రీల్

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.81 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం 39 రోజులకుగాను రూ.2 కోట్ల 81 లక్షల 93 వేల 913 వచ్చినట్లు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. సింహగిరిపై సోమవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 126.300 గ్రాముల బంగారం, 15.140 కిలోల వెండి లభించినట్లు ఈవో పేర్కొన్నారు. లెక్కింపులో దేవస్థానం అధికారులు, సిబ్బంది, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

టీటీడీ డైరీల విక్రయాలు



డైరీని ఆవిష్కరిస్తున్న హైమావతి, సత్యకుమార్

ఎంవీపీకాలనీ: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)రూపొందించిన వేంకటేశ్వరస్వామి ముఖచిత్రాలతో కూడిన డైరీల విక్రయాలను ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం ప్రారంభించారు. కల్యాణ మండప మేనేజర్ హైమావతి, అధ్యాత్మిక వేత్త సత్యకుమార్‌తో కలిసి వీటిని ఆవిష్కరించారు. రూ.150 డైరీలు 10 వేలు, రూ.120 డైరీలు 2 వేలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. తెలుగు పంచాంగం క్యాలెండర్ రూ.30, నెలల వారీ క్యాలెండర్ రూ.130కి విక్రయించనున్నట్లు వెల్లడించారు. రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 వరకు విక్రయాలు జరుగుతాయన్నారు.

అప్పన్న సన్నిధిలో వైస్ అడ్మిరల్ దీపక్ కపూర్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న దీపక్ కపూర్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని నేవీ లాజిస్టిక్స్ కంట్రోలర్ ఏవీఎస్ఎం వైస్ అడ్మిరల్ దీపక్ కపూర్ కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలో పూజలు జరిపి, వేద ఆశీర్వచనమిచ్చారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్ అందించారు.

పండగల వేళ ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: పండగల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. సికింద్రాబాద్–విశాఖపట్నం(07097) స్పెషల్ ఈ నెల 15, 22, 29వ తేదీల్లో సాయంత్రం 4.35 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 6.30 గంటకు విశాఖపట్నం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో విశాఖపట్నం–సికింద్రాబాద్ (07098) స్పెషల్ ఈ నెల 16, 23, 30వ తేదీల్లో రాత్రి 7.50 గంటలకు విశాఖలో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

- సికింద్రాబాద్–బ్రహ్మపూర్(07027) సమ్మర్ స్పెషల్ ఈ నెల 13, 20, 27వ తేదీల్లో రాత్రి 8.15 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.22 గంటలకు దువ్వాడకు, మధ్యాహ్నం 2.45 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్–సికింద్రాబాద్(07028) సమ్మర్‌స్పెషల్ ఈ నెల 14, 21, 28వ తేదీల్లో సాయంత్రం 4.45 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 9.55 గంటలకు దువ్వాడకు, మరుసటిరోజు ఉదయం 11.35 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

రేపు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

మహారాణిపేట: జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 11వ తేదీన నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఆమె చాంబర్ సమీపంలోని వీసీ హాలు, జెడ్పీ సమావేశ మందిరంలో ఏడు స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు.



ఇదేం మేత

కోళ్ల వ్యర్థాలతో కాసుల వేట

- సహకరిస్తున్న జీవీఎంసీ, మత్స్యశాఖ, పోలీసు విభాగాలు
- చికెన్ వ్యర్థాల తరలింపునకు టెండర్లు పిలిచిన ప్రజారోగ్య విభాగం
- తమ వారికే టెండర్లు కావాలంటూ కూటమి నేతల ఒత్తిళ్లు
- నెలలు గడుస్తున్నా టెండర్లు తెరవకుండా తాత్సారం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

ఎక్కువ లాభాలు ఆర్జించాలన్న దురాశతో చేపలకు మేతగా కోళ్ల వ్యర్థాలను భారీ స్థాయిలో తరలిస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. అధికారులు కూడా సహకరించడంతో ఈ దందా యథేచ్ఛగా సాగిపోతోంది. జీవీఎంసీ పరిధిలోని చికెన్, మటన్ షాపుల్లో వ్యర్థాలను కాపులుప్పాడలోని డంపింగ్‌యార్డుకు తరలించేందుకు రెండేళ్ల క్రితం కొందరు కాంట్రాక్టర్లు టెండర్లు పొందారు. అయితే ఈ కోళ్ల వ్యర్థాలను అక్రమంగా చేపల చెరువులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ వ్యవహారం జరుగుతున్నప్పటికీ.. ఇటు జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు గానీ, అటు మత్స్యశాఖ, పోలీసుశాఖ అధికారులు గానీ కన్నెత్తి చూడటం లేదు. కాపులుప్పాడలో నిర్ణీత మొత్తంలో సేకరించిన మేరకు చికెన్ వ్యర్థాలు వస్తున్నాయా? లేదా అని పరిశీలించాల్సిన అధికారులు కూడా ఇందులో భాగస్వామ్యమై తప్పుడు నివేదికలు సమర్పిస్తున్నట్టు తెలుస్తోంది. తాజాగా మాడుగుల నియోజకవర్గంలోని దేవరాపల్లి వద్ద చికెన్ వ్యర్థాలతో వచ్చిన వాహనాన్ని ప్రజలు ఫిర్యాదు చేసి పట్టించారు. ఇందులో అందరికీ భాగస్వామ్యం ఉండడంతో ఈ వ్యవహారాన్ని అక్కడికక్కడే తొక్కేశారు.

టెండర్లు తెరవకుండా పాత వారితోనే పనులు

వాస్తవానికి ప్రస్తుతం చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న ఏజెన్సీల టెండరు గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో కొత్తగా టెండర్లను ప్రజారోగ్య విభాగం అధికారులు పిలిచారు. కానీ నెలలు గడుస్తున్నా వీటిని మాత్రం తెరవడం లేదు. ఈ టెండర్లను దక్కించుకునేందుకు కూటమి నేతల నుంచి తీవ్ర ఒత్తిళ్లు వస్తుండటంతో టెండర్లు తెరవకుండా పాత వారితోనే పనులు కానిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారం నడుపుతున్న వారితోనూ జీవీఎంసీలోని అధికార పార్టీకి చెందిన నేతలు మామూళ్లకు అలవాటు పడటంతో వీరి ఆటలు ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి.

అధికారుల తీరుపై అనుమానాలు

గడువు ముగిసినప్పటికీ కొత్త టెండర్లను పిలిచి మరీ తెరవకుండా పాత వారినే కొనసాగించడంపై జీవీఎంసీ అధికారుల వ్యవహారశైలిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి రెండేళ్ల క్రితం ఆన్‌లైన్ టెండర్లు కాకుండా బాక్సు టెండర్లను ఆహ్వానించారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఆన్‌లైన్ టెండర్లను ఈ–ప్రొక్యూర్‌మెంట్ ద్వారానే చేపడుతున్నారు. జీవీఎంసీలో మాత్రం బాక్సులను వదలడం లేదు. అందులోనూ ప్రజారోగ్య విభాగంలోనే అధికంగా బాక్సు టెండర్లను ఆశ్రయిస్తుండటం గమనార్హం. తాజాగా పిలిచిన టెండర్లు కూడా బాక్సు టెండర్లేనని తెలుస్తోంది.

గత టెండర్లలోనూ మతలబు



అనకాపల్లి నుంచి కాపులుప్పాడకు చికెన్ వ్యర్థాలను తరలించేందురు తక్కువ ధరను కోట్ చేసిన కాంట్రాక్టర్లు.. మధురవాడ నుంచి కాపులుప్పాడకు తరలించేందుకు మాత్రం ఎక్కువ ధరను కోట్ చేశారు. దీనికి జీ హుజూర్ అంటూ తలూపిన జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు కాంట్రాక్టును కట్టబెట్టారు. అనకాపల్లి నుంచి యలమంచిలి, పెందుర్తి, మాడుగులలోని చేపలు చెరువులకు తరలించేందుకు దగ్గర కావడంతోనే తక్కువ ధరను కోట్ చేశారు. మధురవాడ నుంచి తరలించాలంటే ఎక్కువ దూరం, ఎక్కువ ఖర్చు అవుతుందని భావించి అధిక ధరను కోట్ చేశారు. అంతేకాకుండా కోళ్ల వ్యర్థాలను చేపలు, రొయ్యల చెరువులకు తరలిస్తున్నారన్న విమర్శల నేపథ్యంలో రద్దు చేశారు. అయితే, కోర్టు నుంచి ఆదేశాలున్నాయనే కారణంగా తిరిగి వీరికే కాంట్రాక్టును అప్పగించారు.

పట్టుబడుతున్నా పట్టించుకోరే...!



వాస్తవానికి అనకాపల్లిలో సేకరించిన కోళ్ల వ్యర్థాలను యలమంచిలి, మాడుగుల, పెందుర్తిలోని చేపల చెరువులకు, భీమిలి, విశాఖ నగరంలో సేకరించిన వాటిని బైపాస్ ద్వారా అవే ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇది చట్టరీత్యా నేరం. తాజాగా దేవరాపల్లి మండలంలో కోళ్ల వ్యర్థాలను చేపలు, రొయ్యల చెరువులో కలుపుతున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేయడంతో బయటపడింది. అయినప్పటికీ ఈ వ్యవహారాన్ని పక్కదారి పట్టించినట్టు తెలుస్తోంది.

ఎందుకు ఈ వ్యర్థాలను వాడుతున్నారంటే..



కోళ్ల వ్యర్థాలను తినడం వల్ల చేపలు త్వరగా బరువు పెరగడంతోపాటు మేత ఖర్చు కూడా తగ్గుతుంది. సాధారణంగా చేపలకు ఆహారంగా తవుడు, సోయాబీన్ వంటి వాటితో ఉత్పత్తి చేసిన మేతను వాడతారు. ఈ మేత మార్కెట్‌లో కిలో రూ.30 వరకు ఉంటుంది. కిలో చేపను పెంచడానికి సుమారు రూ.50కిపైగా ఖర్చవుతుంది. కానీ ఆరోగ్యవంతమైన చేపలు ఈ ఆహారంతో అందుబాటులోకి వస్తాయి. అదే కోళ్ల వ్యర్థాలతో కిలో చేపను పెంచేందుకు రూ.30లోపే ఖర్చవుతుండటం, త్వరగా చేపలు బరువు పెరుగుతుండటంతో వీటిపైనే కొందరు పెంపకందారులు దృష్టిసారిస్తున్నారు. అయితే ఈ చేపలను తినే వారు అనేక వ్యాధుల బారినపడతారనే విషయాన్ని వారు గ్రహించలేకపోతున్నారు.

ఆరోగ్యానికి హానికరం



కోళ్ల వ్యర్థాలతో పెంచిన చేపలను తినడం ఆరోగ్యానికి హానికరం. కాలేయ, జీర్ణకోశ, న్యూరో సమస్యలతో పాటు పేగులో పుండ్లు, గ్యాస్ట్రిక్, మలబద్ధకం, పైల్స్, చర్మ వ్యాధులు వంటివి తలెత్తుతాయి. మహిళలకు నెలసరి, పలు రకాల క్యాన్సర్ సమస్యలు వస్తాయి. వీటిని తిన్న చిన్నారులైతే త్వరగా అనారోగ్యం బారిన పడతారు. పైగా కోళ్ల వ్యర్థాలు ఉపయోగించే లేదా నిల్వచేసే పరిసర ప్రాంతాలు పూర్తిగా వైరస్‌తో నిండి పర్యావరణానికి ముప్పు కలిగేలా తయారవుతుంది. అక్కడి గాలి కూడా ప్రమాదకరంగా మారుతుంది. ఈ గాలిని పీల్చేవారు త్వరగా వ్యాధుల బారిన పడతారు.

మనోడే.. ఇచ్చేయ్..!



రైతు బజార్లనూ వదలని కూటమి నేతలు

- స్టాళ్లకు డిమాండ్‌తో వసూళ్ల పర్వం
- 30 స్టాళ్ల కోసం 140కి పైగా దరఖాస్తులు
- 11న స్టాళ్ల కేటాయింపునకు డ్రా

విశాఖ విద్య: కూటమి నేతలు ఏ ఒక్కర్నీ వదలడం లేదు. రైతుబజార్లలో కూడా రాజకీయ వ్యాపారం చేస్తున్నారు. అర్హులైన రైతులు, డ్వాక్రా గ్రూపులు, దివ్యాంగులకు రైతుబజార్లలో దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఇస్తుండగా.. వీటిని తాము చెప్పిన వారికే ఇవ్వాలని సిఫార్సులు చేస్తున్నారు. ఇందుకు వసూళ్లకు తెరతీసినట్లు సమాచారం. జిల్లాలో సీతమ్మధార మినహా మిగతా రైతుబజార్లలో డ్వాక్రా గ్రూపులకు 23, దివ్యాంగులకు 7 స్టాళ్లను కేటాయించేందుకు ఇటీవల నోటిఫికేషన్ జారీ చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన 140 మంది దరఖాస్తు చేసుకున్నారు. కొత్తగా ప్రారంభిస్తున్న చిట్టివలస రైతుబజార్‌తోపాటు మిగతా రైతు బజార్లలో ఖాళీగా ఉన్న 30 స్టాళ్ల కోసం ఈనెల 11న మధ్యాహ్నం 3 గంటలకు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పర్యవేక్షణలో డ్రా తీయనున్నారు.

జిల్లాలో 13 రైతుబజార్లు

జిల్లాలో 13 రైతు బజార్లు ఉన్నాయి. వీటిలో సీతమ్మధార, ఎంవీపీ కాలనీ, కంచరపాలెం రైతుబజార్లలో అమ్మకాలు జోరుగా సాగుతాయి. గోపాలపట్నం, గాజువాక, పెదవాల్తేరు, స్టీల్‌ప్లాంట్, పెందుర్తి, మధురవాడ రైతుబజార్లు సైతం వినియోగదారులు బాగానే వస్తుంటారు. జిల్లాలోని అన్ని రైతు బజార్లలో కలిపి మొత్తంగా 1,307 స్టాళ్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో 220 వరకు డ్వాక్రా గ్రూపులు, దివ్యాంగులకు కేటాయించారు. మిగతా స్టాళ్ల నిర్వహణకు అర్హతల మేరకు ఉమ్మడి విశాఖ జిల్లాలోని రైతులకు గుర్తింపు కార్డులను జారీ చేస్తున్నారు.


స్టాళ్లకు డిమాండ్

జిల్లాలోని రైతు బజార్లలో దుకాణాల నిర్వహణకు ఉమ్మడి విశాఖ జిల్లాలోని రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తున్నారు. ఇలా ఇప్పటివరకు 2 వేల కార్డులను జారీ చేశారు. మరో 670 మంది కార్డులు పెండింగ్‌లో ఉన్నాయి. స్టాళ్లు పెట్టుకునేందుకు కార్డులు ఇప్పించాలని ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో దరఖాస్తులు వస్తూనే ఉన్నాయి. ఇలాంటి వారిలో కొంతమంది కూటమి నేతలను ఆశ్రయిస్తున్నారు. దీంతో కార్డుకు ఇంతని బేరం పెట్టి, రైతుబజార్లలో వెంటనే తమ వారికి చోటిచ్చేయాలని సిఫార్సు చేస్తున్నట్లు తెలుస్తోంది.

కొత్తగా మరో రెండు రైతు బజార్లు

విశాఖ జిల్లాలోని రైతు బజార్లకు వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ఈ నేపథ్యంలో వీటిలో దుకాణాల ఏర్పాటుకు సైతం రైతుల నుంచి తీవ్రమైన పోటీ ఉంది. ఇప్పటి వరకు జిల్లాలో 2 వేల గుర్తింపు కార్డులు జారీ చేశారు. వీటి ద్వారా అన్ని దుకాణాలు కలిపి నెలకు రూ.30 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. రైతుబజార్ల నిర్వహణ, సిబ్బంది వేతనాల కోసమని రూ.12 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. వినియోగదారుల నుంచి వస్తున్న డిమాండ్‌తో జిల్లాలో ఆరిలోవ, చిట్టివలసలో కొత్తగా రైతుబజార్లు ఏర్పాటు చేసేందుకు అంతా సిద్ధం చేశారు.


ప్రాధాన్యత క్రమంలో కార్డుల జారీ



రైతు బజార్లలో దుకాణాల నిర్వహణకు రైతులు, డ్వాక్రా గ్రూపుల నుంచి డిమాండ్ బాగా ఉంది. ఇప్పటికే రెండు వేలు కార్డులు ఉన్నందున, కొత్త కార్డులను ప్రాధాన్యత క్రమంలోనే జారీ చేస్తున్నాం. ఈ ప్రక్రియ అంతా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పర్యవేక్షణలో జరుగుతుంది.

– షేక్ యాసిన్,
జిల్లా వాణిజ్య, మార్కెటింగ్ అధికారి

అవకతవకలపై విచారణ జరపాలి



రైతుబజార్లలో దుకాణాల నిర్వహణకు జారీ చేస్తున్న కార్డులను కూటమి నేతలతో కలిపి అధికారులు అమ్ముకుంటున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. ఇటీవల ఎవరికి కార్డులు జారీ చేశారనే దానిపై జిల్లా అధికారులు సమగ్ర విచారణ జరిపించాలి. దీనిపై ఆర్టీఐ ద్వారా కూడా వివరాలు సేకరిస్తాం.

– అల్లా కృష్ణ,
మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్

ప్రభుత్వ వైఫల్యాలపై వైఎస్సార్‌సీపీ ఆందోళనలు



సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల అధ్యక్షులు, సమన్వయకర్తలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

- 13న ధాన్యం సేకరణపై జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాల అందజేత
- 27న పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా నిరసన
- జనవరి 3న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఆందోళన
- వైఎస్సార్‌సీపీ శ్రేణులతో శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స



సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పార్టీ ముఖ్యనేతలు

సాక్షి, విశాఖపట్నం: కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ఉమ్మడి విశాఖ జిల్లాలో ఈ నెల 13 నుంచి జనవరి 3వ తేదీ వరకు వైఎస్సార్ సీపీ ఆందోళనలు చేపట్టనున్నట్లు శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, వైఫల్యాలు, ప్రజలు పడుతున్న ఇబ్బందుల నేపథ్యంలో వైఎస్సార్ సీపీ కార్యాచరణను ప్రకటించిందన్నారు. ఈ నెల 13న ధాన్యం సేకరణపైన, 27వ తేదీన పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా, జనవరి 3వ తేదీన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై తమ పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు, పార్టీ ముఖ్యనేతలతో సమావేశమై చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ అల్లూరి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరావు, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంభా రవిబాబు, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ జి.మాధవి, మాజీ ఎమ్మెల్యేలు కంబాల జోగులు, రమణమూర్తిరాజు, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, భాగ్యలక్ష్మి, తిప్పల నాగిరెడ్డి, తైనాల విజయ్‌కుమార్, తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, చెంగల వెంకటరావు, శోభా హైమావతి, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు, బి.సత్యవతి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు జాన్ వెస్లీ, పివిఎస్ఎన్ రవి, శోభాస్వాతి రాణి , చొక్కాకుల వెంకటరావు, పేర్ల విజయ్‌చందర్, పోతిన శ్రీనివాసరావు, సుజాత సత్యనారాయణ, బొడ్డేడ ప్రసాద్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, గొలగాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎల్ఐసీని నిర్వీర్యం చేసే కుట్రను తిప్పికొట్టాలి



నిరసన తెలుపుతున్న ఎల్ఐసీ ఏజెంట్లు

డాబాగార్డెన్స్: ఎల్ఐసీలో అక్టోబర్ ఒకటో తేదీ నుంచి ప్రవేశపెట్టిన ప్రతిపాదనలు తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరుతూ సోమవారం ఎల్ఐసీ ఏవోఐ ఆధ్వర్యంలో ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద మహాధర్నా చేపట్టారు. ఏవోఐ డివిజన్ అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ ధర్నాలో అఖిల భారత వర్కింగ్ ప్రెసిడెంట్ మంజునాథ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసీలో ఐపీవో ద్వారా షేర్లు విక్రయించి సంస్థను నిర్వీర్యం చేయాలని చూస్తోందన్నారు. ఈ విధానాల వల్ల 14 లక్షల మంది ఏజెంట్ల భవిష్యత్ అగమ్యగోచరంగా మారిందన్నారు. డిమాండ్ల సాధనకు బ్రాంచ్‌ల వారీగా విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించి కోటి సంతకాలతో పార్లమెంట్ సభ్యులకు వినతి పత్రాలు ఇవ్వాలని ఏజెంట్లకు సూచించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 11న లక్షలాది మందితో చలో పార్లమెంట్ కార్యక్రమం తలపెట్టినట్లు తెలిపారు. ధర్నాలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికిశోర్, డివిజన్ అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎన్.రవీంద్రనాథ్ ఠాగూర్, యూనియన్ గౌరవ అధ్యక్షుడు, సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, కె.త్రిమూర్తులు, ఆంజనేయులు, అబ్దుల్ సత్తార్, శ్రీరాములు, ధనుంజయ్, శ్రీనివాసరావు, నారాయణరావు, రామారావు, రమణబాబు, ఈశ్వరరావు, కావ్య, మాధవి పెద్ద ఎత్తున ఏజెంట్లు పాల్గొన్నారు.

హాస్టల్ నుంచి నలుగురు విద్యార్థుల పరారీ

అల్లిపురం: మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధి, ఆంథోని బోర్డింగ్ హోమ్ నుంచి నలుగురు విద్యార్థులు పరారైనట్లు హోమ్ ఇన్‌చార్జ్ కచ్చా వేళంగిణి సోమవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు. సోమవారం ఉదయం రోజువారి ప్రార్థనలకు చర్చికి వెళ్లిన గుడాల రఘు, బెడపాటి చరణ్, నక్కాన కిరణ్‌కుమార్, పచ్చిపాల కార్తీక్ సాయంత్రం 6.30 గంటలైనా కనిపించలేదు. సీసీ కెమెరాలను పరిశీలించగా గోడ దూకి పారిపోయినట్లు గుర్తించారు. విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు తెలిపారు. వారంతా కలిసి ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, ఆర్కేబీచ్ తదితర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించారు. వీరి ఆచూకీ తెలిసిన వారు 9182065772, 9440796010 నంబర్లలో తెలియజేయాల్సిందిగా పోలీసులు కోరారు.

● అలలు పోయి.. శిలలు వచ్చె..



నిత్యం అలలతో ఎగసి పడే సంద్రం..సోమవారం వెనక్కు తగ్గింది. ఇప్పటి వరకు అలల మాటున ఉన్న శిలలు అందమైన ఆకృతులతో సరికొత్తగా పరిచయం చేసుకున్నాయి. వాతావరణ మార్పులతో సముద్రం వెనక్కు వెళ్లడంతో వైఎంసీఏ ప్రాంతంలో నల్లని రాళ్లు కనువిందు చేశాయి. దీంతో సందర్శకులు సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు.

–ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

మత్తు పదార్థంతో ఇద్దరి అరెస్ట్

అల్లిపురం: అనుమానిత మత్తు పదార్థం కలిగిన ఇద్దరు యువకులను టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఎస్.ఐలు సింహాచలం, రాము ఇతర సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహిస్తుండగా..వీరిని చూసి ఇద్దరు యువకులు పారిపోవడానికి ప్రయత్నించారు. అలెర్ట్ అయిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చిన్న పొట్లంలో అనుమానిత మత్తు పదార్థాన్ని గుర్తించారు. ఆరా తీయగా గోవా నుంచి తీసుకువస్తున్నామని వారు తెలిపారు. అనకాపల్లి జిల్లా చోడవరం మండలం ద్వారకానగర్‌కు చెందిన కండిపల్లి రామతేజ, పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం, లక్ష్మీపురానికి చెందిన దూస అనిల్ అలియాస్ అనిల్‌కుమార్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

- ఏయూ స్నాతకోత్సవంపై కానరాని స్పష్టత
- గత సెప్టెంబర్‌లో నోటిఫికేషన్, 2 వేలకు పైగా దరఖాస్తులు
- వర్సిటీ అధికారుల తాత్సారంతో ఓడీలు తీసుకుంటున్న వైనం
- డాక్టరేట్ పట్టభద్రులకూ తప్పని నిరీక్షణ
- చెల్లించిన ఫీజేదంటున్న విద్యార్థులు



ఆంధ్ర విశ్వవిద్యాలయం

ఆచార్యా... పట్టా ఇచ్చేదెప్పుడో..!

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీకి త్వరలోనే తీపి కబురు వస్తుంది.. పూర్వ విద్యార్థుల సమ్మేళనం వేదికపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్న మాట ఇది. రెగ్యులర్ వీసీ పోస్టు భర్తీ కోసమే ఈ వ్యాఖ్యలు చేశారని, వర్సిటీ అధికారుల్లో చర్చ జరుగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇలాంటి ప్రచారమే జరుగుతోంది. రెగ్యులర్ వీసీ వస్తే తమ సీటుకు గ్యారెంటీ లేదనే శంకతో విభాగాధిపతులంతా స్తబ్దుగా ఉంటున్నారు. దీంతో ఏయూ పాలన ఒకడుగు ముందుకు.. మూడడుగులు వెనక్కి అన్నట్లుగా మారింది. కీలక నిర్ణయాలకూ అధికారులు వెనుకంజ వేస్తున్నారు. వర్సిటీ స్నాతకోత్సవ(కాన్వొకేషన్) వ్యవహారమే ఇందుకు తార్కాణం.

గత సెప్టెంబర్‌లో నోటిఫికేషన్

ఏయూ 91, 92వ స్నాతకోత్సవానికి 2023 సెప్టెంబర్ 6వ నోటిఫికేషన్ జారీ చేశారు. 2021–22, 2022–23 విద్యా సంవత్సరంలో డిగ్రీ, పీజీ, డాక్టరేట్(పీహెచ్‌డీ) ఉత్తీర్ణత సాధించిన వారికి ఈ వేదికపై పట్టాలు అందిస్తామని ప్రకటించారు. బెస్ట్ రీసెర్చర్ అవార్డు కోసం వర్సిటీ కాలేజీల ప్రిన్సిపాళ్ల నుంచి సమగ్ర వివరాలు కావాలని సర్క్యులర్ కూడా జారీ చేశారు. ఈ ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటం, వెనువెంటనే వీసీని మార్చేయడంతో స్నాతకోత్సవానికి బ్రేకులు పడ్డాయి.

చెల్లించిన డబ్బులు మాటేంటి?

స్నాతకోత్సవ వేదికపై పట్టా తీసుకోవాలనే ఆసక్తితో ఒక్కో విద్యార్థి రూ.వెయ్యి చొప్పున వర్సిటీకి ఫీజు చెల్లించారు. ఇది ఎప్పుడు జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో ఓడీలు తీసుకున్న విద్యార్థులతోపాటు, ఫీజు చెల్లించిన మరి కొందరు తమ డబ్బులు తిరిగివ్వాలని కోరుతున్నారు.

వర్సిటీ అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసినందున నిర్వహించటమో, లేదంటే వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించడమో చేయాలి. వర్సిటీ అధికారులు కనీస కసరత్తు చేయకపోవటంపై విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్నాతకోత్సవ నిర్వహణపై స్పష్టత కోరుతూ, వర్సిటీ అధికారుల తీరును ఎండగడుతూ, కొంతమంది విద్యార్థులు సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేశారు.

అడిగిన వారికి ఓడీలు

కాన్వొకేషన్‌కు పరీక్షల విభాగం పరంగా అంతా సిద్ధం చేశాం. అయితే, దీన్ని ఎప్పుడు నిర్వహిస్తారనేది వర్సిటీ పెద్దలే చెప్పాలి. ఓడీ కావాలని వచ్చిన వారికి, ఇచ్చేస్తున్నాం. ఇలా చేయటం వల్ల దరఖాస్తు చేసుకున్న వారిలో ఎంతమంది ఇంకా మిగిలారనే లెక్క స్పష్టంగా చెప్పలేం. వారు చెల్లించిన ఫీజు వాపసు విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

– టి.చిట్టిబాబు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్, ఏయూ

పట్టభద్రుల్లో తీవ్ర నిరాశ

స్నాతకోత్సవ వేదికపై పట్టా అందుకోవడాన్ని జీవితకాల మధురానుభూతిగా విద్యార్థులు భావిస్తారు. రీసెర్చ్ స్కాలర్(పీహెచ్‌డీ)లైతే వేయి కళ్లతో ఎదురు చూస్తుంటారు. ప్రస్తుత ఏయూ అధికారుల నిర్వాకంతో పట్టభద్రులకు నిరాశే మిగులుతోంది. స్నాతకోత్సవ నిర్వహణకు వర్సిటీ నోటిఫికేషన్‌తో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ హోల్డర్లు 2 వేలకు పైగానే దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది. నోటిఫికేషన్ జారీ అయి ఏడాదవుతున్నా ఇంకా స్పష్టత లేదు. దీంతో ఉన్నత చదువులు, ఉద్యోగ అవసరాల రీత్యా చాలా మంది వర్సిటీకి వచ్చి ఒరిజినల్ డిగ్రీల(ఓడీ)ను తీసుకుపోతున్నారు.



ఓడీల కోసం వచ్చిన విద్యార్థులు

‘కౌశల్’లో విద్యార్థుల ప్రతిభ

విశాఖ విద్య: భారతీయ విజ్ఞాన మండలి, ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన జరిగిన జిల్లా స్థాయి కౌశల్– 2024 ప్రతిభ అన్వేషణ పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. జిల్లా స్థాయి పోటీల ఫలితాలను సోమవారం నిర్వాహకులు ప్రకటించారు. క్విజ్ విభాగంలో 8వ తరగతి నుంచి టి.రోహిత (జెడ్పీహెచ్‌ఎస్ కణితి), కె.డానియల్ (కేడీపీఎం హైస్కూల్) ఎంపికయ్యారు. 9వ తరగతి నుంచి డి.మనోజ్ (భీమిలి మున్సిపల్ హైస్కూల్), ఐ.సోనియా (కేజీబీవీ, భీమిలి), 10వ తరగతి నుంచి అశ్విని (జెడ్పీహెచ్ఎస్, రేవడి), పి.సాయివర్ధన్ (మున్సిపల్ హైస్కూల్ చిట్టివలస) ఎంపికయ్యారు. పోస్టర్ విభాగంలో 8వ తరగతి నుంచి చైత్ర వర్షిణి (జెడ్పీహెచ్ఎస్, అడవివరం), ఐ.మహిత (క్వీన్ మేరీ స్కూల్), 9వ తరగతి నుంచి పి.చరణ్ కుమార్ (మధురానగర్ మున్సిపల్ స్కూల్), ఎస్.విజయ్ దుర్గ (మున్సిపల్ హైస్కూల్, 14వ వార్డు) ఎంపికయ్యారు. 10వ తరగతి రీల్ విభాగంలో ఎల్.కౌశిక్ (జెడ్పీహెచ్ఎస్ నడుపూరు), బి.కృష్ణ హరిణి (జెడ్పీ హైస్కూల్, చిట్టివలస) గెలుపొందారు. జిల్లా స్థాయి పోటీలను విజయవంతం చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి, వివిధ పాఠశాల హెచ్ఎంలు, సమన్వయకర్తలకు స్టేట్ అకడమిక్ మానిటరింగ్ సభ్యుడు శ్రీనివాసరావు, జిల్లా సమన్వయకర్త నాగేశ్వరరావు, జిల్లా సహ సమన్వయకర్త ఎ.రామలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఈ నెల 29, 30 తేదీల్లో విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్ధం కావాలని సూచించారు.

నేడు, రేపు జాబ్‌మేళా

మురళీనగర్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు సోమవారం తెలిపారు. మంగళవారం కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీలో డబ్ల్యూఎన్ఎస్, అడ్‌హాక్ నెట్‌వర్క్స్, ఐస్మార్ట్ సొల్యూషన్స్ కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటాయన్నారు. వివరాలకు 9490632318 నంబరులో సంప్రదించాల్సిగా కోరారు. బుధవారం పెదగంట్యాడ ఫైర్ స్టేషన్ సమీపంలోని ఎన్ఏసీ కేంద్రంలో ఉదయం 10.30 గంటల నుంచి ఇవే కంపెనీలు మేళా నిర్వహిస్తాయన్నారు. వివరాలకు 9948768778 నంబరులో సంప్రదించాల్సిందిగా సూచించారు. ఆసక్తిగల నిరుద్యోగ అభ్యర్థులు http:// Naipunyam.ap.gov.in లో, లేదా నేరుగా నిర్వహణ కేంద్రాలకు వెళ్లి తమ పేర్లు నమోదు చేసుకోవచ్చు. అభ్యర్థులు ఆధార్ కార్డుతోపాటు తమ సర్టిఫికెట్లు తీసుకురావాల్సి ఉంటుంది. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్ అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా చాముండేశ్వరరావు కోరారు.

జైల్లో మృతిపై మెజిస్టీరియల్ విచారణ జరపాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విదసం సభ్యులు

మహారాణిపేట: విశాఖ సెంట్రల్ జైల్లో జూలై 30న జరిగిన దళిత యువకుడు ఉప్పాడ గౌరీశంకర్ మరణంపై మెజిస్టీరియల్ విచారణ జరపాలని విదసం ఐక్య వేదిక రాష్ట్ర సమితి కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మృతుడి తల్లి నర్సయ్యమ్మతో కలిసి, కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనందపురం మండలం పేకేటి గ్రామానికి చెందిన గౌరీ శంకర్ విశాఖ కేంద్ర కారాగారం మరుగు దొడ్డిలో ఉరి వేసుకున్నట్లు జైలు అధికారులు ప్రకటించి చేతులు దులిపేసుకున్నారని ఆక్షేపించారు. ఆ మరణంపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేసినా, శవ పంచనామా సందర్భంగా అధికారులు వీరి గోడు పట్టించు కోలేదన్నారు. ఖైదీల నడవడికపై జైలు సిబ్బంది పర్యవేక్షణ లోపమే గౌరీ శంకర్ మరణానికి కారణమన్నారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు సోడదాసి సుధాకర్, జాజి ఓంకార్, ఉప్పాడ రాము, రవి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు పునరావృతం కారాదు

- కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కి 218 వినతులు

మహారాణిపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో (పీజీఆర్ఎస్) వచ్చిన ప్రతి అర్జీకి న్యాయమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శేష శైలజ వినతులు స్వీకరించారు. అర్జీలను తక్షణం పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అర్జీలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. మొత్తం 218 వినతులను స్వీకరించినట్లు చెప్పారు. వీటిలో రెవెన్యూ శాఖకు 97, పోలీసు శాఖకు 13, జీవీఎంసీకి 50, ఇతర విభాగాలకు సంబంధించి 58 వినతులు వచ్చాయన్నారు.

పోలీసు పీజీఆర్ఎస్‌కు 102 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని, సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 102 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ స్వయంగా ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటిపై వెంటనే సంబంధిత స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సత్వరమే పరిష్కరించాలని చెప్పారు.

జీవీఎంసీకి 76 వినతులు

డాబాగార్డెన్స్ : జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 76 వినతులు వచ్చాయని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. ప్రధాన కార్యాలయం పాత సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పరిష్కార వేదిక కార్యక్రమంలో కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి మేయర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీలను సకాలంలో పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఆర్ సోమన్నారాయణ, ప్రధాన ఇంజినీరు శివప్రసాదరాజు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, ఎఫ్ఏ అండ్ఏవో మల్లికాంబ, డీసీఆర్ ఎస్ శ్రీనివాస్, పర్యవేక్షక ఇంజినీర్లు శ్యాంసన్ రాజు, కేవీఎన్ రవి, గోవిందరావు, రామ్మోహనరావు, సంపత్ కుమార్ పలువురు అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ సంపత్‌కుమార్

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

విశాఖ సిటీ: ప్రజాదర్బార్‌లో వచ్చిన అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో 16 మంది అర్జీలు అందజేశారు. చైర్మన్, కమిషనర్ స్వయంగా వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఇంజనీరింగ్‌కు 2, ప్లానింగ్‌కు 5, రెవెన్యూకు 5, ఇతర విషయాలపై 4 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్, ఇతర విభాగాధిపతులు భవానిశంకర్, శిల్ప, హరిప్రసాద్, శివాని, వేణుగోపాల్ పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్

ఏయూలో ఆస్ట్రేలియా విద్యార్థులు



ఆస్ట్రేలియా విద్యార్థులతో ఏయూ వీసీ

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ విక్టోరియా యూనివర్సిటీ విద్యార్థులు సోమవారం సందర్శించారు. విక్టోరియా యూనివర్సిటీ ప్రొఫెసర్ మార్సెల్లె కాసియో టోలో, రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ విభాగం డైరెక్టర్ డాక్టర్ గ్రెగ్ అరోన్సెన్, అన్నే మేరీల నేతృత్వంలోని విద్యార్థుల బృందం వీసీని కలిసింది. ఈ సందర్భంగా రెండు విశ్వవిద్యాలయాల మధ్య పరస్పర సహకారం దిశగా చర్చించారు. ఆస్ట్రేలియా యూనివర్సిటీ– ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగంతో సంయుక్తంగా సదస్సుల నిర్వహణ, కార్యక్రమాలను నిర్వహించాలని ప్రతిపాదించారు. కార్యక్రమంలో విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్ రాజు, కేథరిన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇవాంజెలిన్ తదితరులు పాల్గొన్నారు. ఏయూ తరఫున విక్టోరియా యూనివర్సిటీ ప్రతినిధులను సత్కరించారు. అనంతరం విద్యా విభాగాన్ని ఆస్ట్రేలియా విద్యార్థుల బృందం సందర్శించింది.

ఎస్సీ వర్గీకరణకు పెరుగుతున్న వ్యతిరేకత : హర్ష కుమార్

డాబాగార్డెన్స్: విశాఖలో నిర్వహించిన మాలల సింహ గర్జన విజయవంతంతో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకత మరోసారి స్పష్టమైందని మాజీ ఎంపీ జీవీ హర్ష కుమార్ తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ వద్దనే భావనలో ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్సీలున్నాయరన్నారు. ఈ నెల 15న గుంటూరులో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సదస్సు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ఎన్నో హామీలిచ్చిందని, ఇచ్చిన హామీలు ఒక్కటీ ఇప్పటికీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఇదిలా ఉండగా ఇటీవల జాయ్ జమీనా హనీ ట్రాప్ కేసులో సీపీని కొన్ని ప్రశ్నలు అడిగామని.. దీనికి ఆయన నుంచి ఎటువంటి సమాధానం రాలేదన్నారు. ఒత్తిళ్లకు లోబడి, కావాలనే వన్‌సైడ్‌గా జాయ్ జమీనాపై కేసు పెట్టారని హర్షకుమార్ ఆరోపించారు.

రేపు వీపీఈ కో ఆపరేటివ్ సొసైటీ ఉత్సవాలు

డాబాగార్డెన్స్: విశాఖ పోర్టు ట్రస్ట్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ సొసైటీ ఏర్పడి 85 ఏళ్లయ్యిందని, ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం ఉత్సవాలు నిర్వహించనున్నామని సొసైటీ అధ్యక్షుడు ఎం.శ్రీరామమూర్తి, పాలకవర్గ సభ్యులు తెలిపారు. సోమవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. సొసైటీ 1,900 మంది సభ్యులతో రూ.125 కోట్ల టర్నోవర్‌తో ప్రగతి పథంలో దూసుకుపోతోందన్నారు. ప్రతి సభ్యుడికి రూ.15 లక్షల వరకు రుణం మంజూరు చేస్తున్నామన్నారు. 85 ఏళ్ల ఉత్సవాల సందర్భంగా సభ్యులు, డిపాజిటర్లకు సుమారు రూ.కోటి విలువగల బహుమతులు అందజేయనున్నామన్నారు. ఉత్సవాలను పోర్టు అథారిటీ ఏవోబీ సమీపాన సాంబమూర్తి ఆడిటోరియంలో ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నామన్నారు. ముఖ్య అతిథిగా పోర్టు చైర్మన్ ఎం.అంగముత్తు పాల్గొనున్నారని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు సీహెచ్ బాలాజీరావు, కోశాధికారి బి.విజయలక్ష్మి, ఇన్‌చార్జ్ సెక్రటరీ వీవీఎస్ రాజు, డైరెక్టర్లు నాళం విశ్వేశ్వరరావు, డీవీఎస్ రఘురామ్, శోభన్‌బాబు, సురేష్‌కుమార్, కె.వీరాంజనేయరావు, రమణారావు, జి.అప్పారావు, పి.పీటర్ విలియమ్స్, చంద్రరావు, పి.బాబ్జీరావు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సొసైటీ ప్రతినిధులు

ముడసర్లోవలో ఇసుక యార్డు



లారీలతో డంప్ చేస్తున్న ఇసుక

ఆరిలోవ: ముడసర్లోవ ప్రాంతంలో కొత్తగా ఇసుక యార్డు ఏర్పాటు చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో సుమారు 10 ఎకరాల విస్తీర్ణం గల జీవీఎంసీ స్థలంలో ఇసుక డంపింగ్ యార్డు ఏర్పాటు చేసి విక్రయాలు జరిపిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం భీమిలిలో ఇసుక డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయడంతో నగరవాసులకు దూరాభారంతో పాటు రవాణా ఖర్చులు అధికమయ్యాయి. ఈ విషయంలో ప్రజల నుంచి కూటమి ప్రభుత్వం విమర్శలు ఎదుర్కోవడంతో అధికారులు దిగి వచ్చారు. దీంతో ముడసర్లోవ ప్రాంతంలో ఇసుక డంపింగ్‌యార్డు ఏర్పాటుకు సిద్ధమయ్యారు. ఇక్కడ రిజర్వాయర్ వెనుక నీటి సోలార్ ప్లాంట్ ఎదురుగా జీవీఎంసీకి చెందిన ఖాళీ స్థలంలో యార్డు ఏర్పాటు చేశారు. సోమవారం పలు ప్రాంతాల నుంచి పెద్ద లారీలతో ఈ యార్డుకు సుమారు 150 మెట్రిక్ టన్నుల ఇసుక తీసుకువచ్చి సిద్ధం చేసినట్లు సిబ్బంది తెలిపారు. ఇంకా విక్రయాలు జరపలేదన్నారు. పూర్తిగా స్టాక్ వచ్చిన తర్వాత ఒకటి, రెండు రోజుల్లో ఇసుక విక్రయాలు ప్రారంభిస్తామన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం



మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

మహారాణిపేట: జనసేన పార్టీని మరింత బలోపేతం చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ సమీపంలోని అంకోశా ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి ప్రసంగించారు. పార్టీ కోసం శ్రమిస్తూ కార్యకర్తలను ఆదుకుంటామన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 11 మంది జనసైనికులు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారని.. ఒక్కొక్క కుటుంబాని రూ.5 లక్షలు బీమా చెక్కులను అందజేశారు. అలాగే గాయపడిన వారికి కూడా ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌తో పాటు ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అవినీతి... అభివృద్ధికి అవరోధం

- ఏసీబీ డీఎస్పీ ఎస్ నాగేశ్వర రావు

ఏయూక్యాంపస్: అవినీతి పెరిగితే దేశ ప్రగతి కుంటుపడుతుందని అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ బీవీఎస్ నాగేశ్వర రావు అన్నారు. సోమవారం బీచ్ రోడ్డులోని ఓ హోటల్‌లో ఆల్ ఇండియా యాంటీ కరప్షన్ కమీషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ అవినీతి నిర్మూలన దినోత్సవంలో ఆయన మాట్లాడారు. సమాజానికి అతిపెద్ద శత్రువుగా అవినీతి నిలుస్తోందన్నారు. సమాజంలో నిజాయతీపరులను గుర్తించి, గౌరవించడం ఎంతో అవసరమన్నారు. నేరాల శాతం పెరగడానికి అవినీతి కూడా ఒక కారణంగా నిలుస్తోందన్నారు. ఆల్ ఇండియా యాంటీ కరప్షన్ కమీషన్ (ఏఐఏసీసీ) రాష్ట్ర డిప్యూటీ చైర్మన్ అట్టాడ అవినాష్ మాట్లాడుతూ భవిష్యత్ తరాన్ని, యువతను అవినీతికి దూరంగా నిలపాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయాల స్థాయి వరకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. బాధితులకు, ఏసీబీకి వారధిగా తాము పనిచేస్తామన్నారు. సంస్థ స్టేట్ చైర్మన్ రాజాన నాగేంద్ర బాబు మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి అవినీతికి దూరంగా ఉండాలన్నారు. సంస్థ నేషనల్ చైర్మన్ బి.వెంకటేశ్వర రాజు మాట్లాడుతూ అవినీతి పెరిగితే పారదర్శకత లోపిస్తుందన్నారు. జైళ్ల శాఖ విశ్రాంత డీఎస్పీ బీవీ రమేష్ కుమార్ మాట్లాడుతూ మంచి ఆశయంతో ముందుకు వచ్చిన ఏఐఏసీసీ సభ్యులను అభినందించారు. నేషనల్ కన్జ్యూమర్స్ రైట్స్ కమీషన్ రాష్ట్ర చైర్మన్ బల్ల శ్రీనివాస్, ఏఐఏసీసీ సభ్యులు పాల్గొన్నారు.

సెలవుపై వీఎంఆర్‌డీఏ కమిషనర్

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ 15 రోజులు పితృత్వ సెలవుపై వెళ్లనున్నారు. ఈ మేరకు లీవ్ మంజూరు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 23 నుంచి జనవరి 6వ తేదీ వరకు కమిషనర్ సెలవులో వెళ్లనుండడంతో ఆ సమయంలో ఇన్‌చార్జ్‌గా జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్‌ను నియమించింది.